ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 02.03.2026 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. తెలంగాణ, ఏపీ డీసీసీ అధ్యక్షుల శిక్షణ శిబిరంలో పాల్గొనడానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వికారాబాద్ చేరుకున్నారు. పార్టీ శ్రేణులకు రాహుల్ దిశానిర్దేశం చేస్తున్నారు.

2. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు ఆరోపించారు.

3. పశ్చిమ ఆసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో 24 గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసింది. పశ్చిమాసియాలో ఉన్న తెలంగాణ పౌరులకు అవసరమైన సహాయ, సహకారాలు అందిస్తామని మంత్రి లక్ష్మణ్ కుమార్ భరోసా ఇచ్చారు.

4. అన్నారం బ్యారేజీ వద్ద నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు జరపడంపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కే. తారక రామారావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాహుల్ గాంధీ

లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఇవాళ ఉదయం హైదరాబాద్ చేరుకున్నారు. శంషాబాద్ విమానాశ్రయంలో రాహుల్ గాంధీ కి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాదర స్వాగతం పలికారు. కాసేపటి క్రితం కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశం ప్రారంభమైంది. రాహుల్ గాంధీ నేతృత్వంలో జరుగుతున్న ఈ భేటీకి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి

నటరాజన్‌తో పాటు తెలంగాణ, ఏపీ పీసీసీ అధ్యక్షులు హాజరయ్యారు. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడం, భవిష్యత్తు కార్యాచరణపై ఈ సందర్భంగా కీలక చర్చలు జరిపారు. గత తొమ్మిది రోజులుగా ఇక్కడ సాగుతున్న తెలంగాణ, ఏపీ డీసీసీ అధ్యక్షుల శిక్షణ శిబిరంలో భాగంగానే ఈ సమావేశం జరుగుతోంది. పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం రాహుల్ గాంధీ చేస్తున్నారు.

పిటిసి, హైదరాబాద్

<u>కవిత</u>

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తెలంగాణ పర్యటన నేపథ్యంలో జాగృతి అధ్యక్షురాలు కవిత విమర్శలు గుప్పించారు. ఎన్నికల హామీ ప్రకారం ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాల భర్తీ ఏమైందని ఆమె ప్రశ్నించారు. కాంగ్రెస్‌ను నమ్మి ఓట్లేసిన యువత ఆశలను ప్రభుత్వం చిదిమేస్తోందని, ఉద్యోగాలు అడిగితే పోలీసులతో అణచివేస్తున్నారని మండిపడ్డారు. యూత్ డిక్లరేషన్, జాబ్ క్యాలెండర్ అమలు చేయకపోవడం నిరుద్యోగులను వంచించడమేనని ఆమె దుయ్యబట్టారు. తెలంగాణ పోరాటాల గడ్డ అని గుర్తు చేస్తూ, ఇప్పటికైనా ఇచ్చిన హామీని నిలబెట్టుకుని వెంటనే ఉద్యోగాల భర్తీ చేపట్టాలని రాహుల్ గాంధీని కవిత డిమాండ్ చేశారు.

డెస్క్

**<u>ఎన్. రాంచందర్ రావు</u>**

హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు నేతృత్వంలో నిరాహార దీక్ష చేపట్టారు. ఉద్యోగ, ఉపాధ్యాయులతో పాటు విశ్రాంత ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నిరసన చేస్తున్నారు. ఈ దీక్షకు బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు పెద్ద ఎత్తున ఉద్యోగ సంఘాలు తరలివచ్చి సంఘీభావం తెలిపాయి. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ... రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా పదవిని చేపట్టిన నుంచి పేదల ఇళ్లను కూల్చడమే లక్ష్యంగా పెట్టుకున్నారని, హైడ్రా పేరుతో సామాన్యులను ఇబ్బంది పెడుతున్నారని

ఆరోపించారు. అటు మూసీ పరివాహక ప్రాంతాల్లో, ఇటు ఖమ్మం వంటి చోట్ల వందలాది కుటుంబాలను రోడ్డున పడేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

బైట్ .. రామచందర్ రావు

పిటిసి, హైదరాబాద్

**కొండా సురేఖ**

వరంగల్ నగరంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రి కొండా సురేఖ, నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. మత్వాడ ఈద్గా పునరుద్ధరణ, ఎంజీఎం జంక్షన్ వద్ద శిశు సంరక్షణ ప్రతిమను ఆవిష్కరించడంతో పాటు వివిధ డివిజన్లలో కమ్యూనిటీ హాళ్లు, సీసీ రోడ్ల పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ముఖ్యంగా తూర్పు నియోజకవర్గంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాల్లో పాల్గొని లబ్ధిదారులకు వస్త్రాలు అందజేశారు. ప్రతి నియోజకవర్గానికి ఏడాదికి 3 వేల 500 ఇళ్లు మంజూరు చేస్తామని, నిర్మాణ దశలను బట్టి ప్రతి సోమవారం బిల్లులు చెల్లిస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు.

పిటిసి, వరంగల్

**వరంగల్ మేయర్**

వేసవి దృష్ట్యా నీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాలని ముందస్తు పనులు చేపట్టాలని గ్రేటర్ వరంగల్ ఇంజనీర్లకు ఇవాళ మేయర్ గుండు సుధారాణి ఆదేశాలు జారీ చేశారు. నగరంలోని 66 డివిజన్లలో తాగునీటి ప్రణాళికను అమలు చేయాలని మేయర్ గుండు సుధారాణి సూచించారు. పైపులైను లీకేజీలు , వాల్వ్ ల మరమ్మతులు తొందరగా పూర్తి చేయాలని, అన్ని డివిజన్లలో చేతిపంపుల మరమ్మత్తులు వేగవంతం చేయాలని మేయర్ గుండు సుధారాణి సూచనలు చేశారు.

పిటిసి, వరంగల్

విచారణ

తెలంగాణలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై ఈనెల 4వ తేదీన స్పీకర్ విచారణ జరపనున్నారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లోకి వెళ్లిన దానం నాగేందర్, కడియం శ్రీహరిలపై ఆ పార్టీ ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద్, పాడి కౌశిక్ రెడ్డి అనర్హత వేటు వేయాలని పిటిషన్లు దాఖలు చేశారు. గతంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాల నేపథ్యంలో స్పీకర్ ఈ విచారణను చేపట్టారు. ఈ ప్రక్రియ ద్వారా ఫిరాయింపుల వ్యవహారంపై స్పీకర్ నిర్ణయం తీసుకోవాలి.

ప్రెస్ నోట్

**శివధర్ రెడ్డి**

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి నెల చివరి వారంలో 'అరైవ్-అలైవ్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. నిన్న జనగామలో జరిగిన సమీక్షా సమావేశంలో డీజీపీ మాట్లాడుతూ... 'ప్రజాపాలన - ప్రగతి బాట'లో భాగంగా రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తామన్నారు. డ్రైవింగ్‌పై అవగాహన లేకపోవడమే ప్రమాదాలకు ప్రధాన కారణమని ఆయన పేర్కొన్నారు. ఇదే క్రమంలో మహిళల రక్షణ కోసం కొత్తగా షీ టీమ్, భరోసా కేంద్రాలను ప్రారంభించారు. గృహహింస, లైంగిక వేధింపుల బాధితులకు ఈ కేంద్రాల ద్వారా చట్టపరమైన, వైద్య, మానసిక సహాయం అందుతుందని డీజీపీ వివరించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ సీపీ, జిల్లా కలెక్టర్, ఇతర పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పీటీసీ, జనగామ

**కంట్రోల్ రూమ్**

పశ్చిమ ఆసియాలో నెలకొన్న ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో, అక్కడ నివసిస్తున్న తెలంగాణ పౌరుల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో 24 గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. విదేశాంగ మంత్రిత్వ శాఖ, భారత రాయబార కార్యాలయాలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ ప్రభుత్వం అక్కడి పరిస్థితులను పర్యవేక్షిస్తోంది. ఇబ్బందుల్లో ఉన్న వారు, వారి కుటుంబ సభ్యులు సహాయం కోసం వందన బరువా - 9871999044, చక్రవర్తి - 9958322143, జావేద్ హుస్సేన్ - 9910014749, రక్షిత్

నాయక్ - 9643723157 మొబైల్ నంబర్ల ద్వారా సంప్రదించవచ్చు. ప్రయాణ అంతరాయాలు, ఇతర అత్యవసర సమయాల్లో అవసరమైన సమన్వయం, సహాయాన్ని అందించేందుకు ఈ బృందం అందుబాటులో ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. కేంద్రంతో కలిసి పౌరుల క్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని తెలంగాణ సర్కార్ భరోసా ఇచ్చింది.

డెస్క్

**<u>అడ్లూరి లక్ష్మణ్ కుమార్</u>**

పశ్చిమాసియాలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో అక్కడ ఉన్న భారతీయులు, ముఖ్యంగా జగిత్యాల జిల్లా వాసులు ధైర్యంగా ఉండాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. వారి భద్రతపై రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని, కేంద్రంతో నిరంతరం సంప్రదిస్తుందని తెలిపారు. అక్కడున్న వారు తమ యోగక్షేమాలను ఎప్పటికప్పుడు కుటుంబ సభ్యులకు, అధికారులకు తెలియజేయాలని సూచించారు. నిరంతర సమీక్షల ద్వారా తెలంగాణ పౌరులకు అవసరమైన సహాయం అందిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు.

BYTE ... అడ్లూరి లక్ష్మణ్ కుమార్

పిటిసి, జగిత్యాల

**<u>జీహెచ్ఎంసీ</u>**

జీహెచ్ఎంసీ నిన్న చేపట్టిన 'ఆస్తి పన్ను పరిష్కారం' కార్యక్రమానికి నగరవాసుల నుంచి విశేష స్పందన లభించింది. అన్ని సర్కిల్ కార్యాలయాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగిన ఈ ప్రత్యేక శిబిరంలో పన్నుల హెచ్చుతగ్గులు, విస్తీర్ణం తప్పులు, మ్యుటేషన్ వంటి సమస్యలపై మొత్తం 285 దరఖాస్తులు అందాయి. డిప్యూటీ కమిషనర్లు స్వయంగా దరఖాస్తులను స్వీకరించి నిబంధనల ప్రకారం పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సౌకర్యం మార్చి నెలలోని అన్ని ఆదివారాల్లో అందుబాటులో ఉంటుందని అధికారులు వెల్లడించారు. పన్ను చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

డెస్క్

**<u>అవగాహన ఒప్పందం</u>**

కరీంనగర్ ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కెరీర్ కోషంట్ కంపెనీ మధ్య విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల పెంపు కోసం అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ద్వారా ఇన్ఫోసిస్, ఐబీఎం వంటి ప్రముఖ సంస్థల సర్టిఫికేషన్ కోర్సులు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్ వంటి ఆధునిక సాంకేతిక రంగాల్లో శిక్షణ లభిస్తుందని ప్రిన్సిపాల్ డాక్టర్ కల్వకుంట్ల రామకృష్ణ తెలిపారు. ఇన్ఫోసిస్ ప్రతినిధి పి. అశోక్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ, ప్లేస్‌మెంట్ ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రపంచస్థాయి పోటీని తట్టుకునేలా విద్యార్థులకు పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలను అందించడమే ఈ ఎంఓయూ ప్రధాన లక్ష్యం. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల సమన్వయకర్తలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పిటిసి, కరీంనగర్

**తారక రామారావు**

అన్నారం బ్యారేజీ వద్ద నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు జరపడంపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కే తారక రామారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్యారేజీ పిల్లర్ల వద్దే ఇసుక తోడేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టును ప్రమాదంలోకి నెడుతోందని ఆరోపించారు. కాళేశ్వరాన్ని దెబ్బతీసి బీఆర్ఎస్ ప్రభుత్వంపై బురదజల్లేందుకే ఇటువంటి కుట్రలు చేస్తున్నారని, ఇసుక మాఫియాపై వెంటనే క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ వనరులను కొల్లగొడుతున్న కాంగ్రెస్ నేతలకు ప్రజలు త్వరలోనే గుణపాఠం చెబుతారని కేటీర్ హెచ్చరించారు. బ్యారేజీలకు ఏమైనా జరిగితే పూర్తి బాధ్యత ప్రభుత్వానిదేనని రామారావు స్పష్టం చేశారు.

డెస్క్

**అసిఫాబాద్ - శ్రీపాదరావు జయంతి**

అసిఫాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ శాసనసభాపతి దుద్దిల్ల శ్రీపాదరావు జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లా కలెక్టర్ కె. హరిత, అదనపు కలెక్టర్ డేవిడ్, ఎస్పీ నీతిక పంత్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ

సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీపాదరావు గారు ప్రజాస్వామ్య విలువలను కాపాడటంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. సభను నిష్పక్షపాతంగా నడిపి అధికార, ప్రతిపక్షాలకు సమాన న్యాయం చేసిన గొప్ప నాయకుడని పేర్కొన్నారు. సరళ జీవనం, విలువల రాజకీయాలకు ప్రతీకగా నిలిచిన ఆయన, ప్రజల సమస్యలను అసెంబ్లీలో బలంగా వినిపించారని వారు గుర్తు చేసుకున్నారు.

పిటిసి, ఆసిఫాబాద్

**శ్రీపాదరావు జయంతి**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ స్పీకర్ స్వర్గీయ శ్రీపాదరావు 89వ జయంతి వేడుకలు ధర్మపురిలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శ్రీపాదరావు స్పీకర్‌గా ఉన్న సమయంలో అధికార, ప్రతిపక్ష సభ్యులకు సమాన అవకాశాలు కల్పించి సభ గౌరవాన్ని పెంచారని మంత్రి కొనియాడారు. కాంగ్రెస్ పార్టీకి ఆయన చేసిన సేవలు అనన్యమని, ఆయన జీవితం భావితరాలకు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. మహోన్నత వ్యక్తిత్వం కలిగిన శ్రీపాదరావు ఆశయాలను కొనసాగించడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని మంత్రి అభిప్రాయపడ్డారు.

పిటిసి, జగిత్యాల

బాబ్లీ ప్రాజెక్టు

సుప్రీంకోర్టు ఆదేశాలను అనుసరిస్తూ మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్టు గేట్లను నిన్న సాయంత్రం అధికారులు ఎత్తారు. కేంద్ర జల వనరుల శాఖ, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల అధికారుల సమక్షంలో ఈ ప్రక్రియ జరిగింది. ప్రతి సంవత్సరం జూలై 1 నుంచి అక్టోబర్ 29 వరకు దిగువకు నీటిని విడుదల చేయాలన్న నిబంధన ప్రకారం, ప్రస్తుతం 0.6 టీఎంసీల నీటిని తెలంగాణ వైపు వదిలారు. దీనివల్ల గోదావరి పరివాహక ప్రాంతంలోని ప్రాజెక్టులకు జలకళ రానుంది.

డెస్క్

**INTER SET:**

తెలంగాణలో ఈరోజు జరుగుతున్న ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరం మ్యాథ్స్ పేపర్ - 1ఎ, బోటని, పొలిటికల్ సైన్స్ పేపర్ 1 లో సెట్ బి, ప్రశ్నాపత్రం ఎంపిక చేశారు. విద్యార్థులు గమనించగలరు.

MS